హైదరాబాద్ వార్త



## ఎల్బీస్టేడియంలో 'ముఖేష్‌గౌడ్ మెమోరియల్ "మల్లయుద్ధం "

**రెజ్లింగ్ పోటీలను ప్రారంభించిన మాజీ మంత్రి డికె అరుణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
ముఖేష్‌గౌడ్ మెమోరియల్ "మల్లయుద్ధ "రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు గురువారం ఎల్బీస్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారును గుర్తించి, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన ఉపకార వేతనాలు అందిచే బృహత్తర లక్ష్యంతో శ్రేష్ఠ్‌ఫౌండేషన్ నిర్వహిస్తున్న కుస్తీ పోటీలను మాజీ మంత్రి ,బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రంగౌడ్‌తో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ "ముఖేష్‌గౌడ్ రెజ్లర్‌గా కేరీర్ మొదలుపెట్టారు. ఆయన స్మారకార్థం రూ.35లక్షలు నగదు బహుమతితో కుస్తీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రేష్ట్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర రెజ్లర్లు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కాగా తొలిరోజు పురుషుల అండర్ 15, అండర్ 17 విభాగాల్లో కుస్తీపోటీలు జరిగాయి. 17విభాగాల్లో 700 మంది రెజ్లర్లు పోటీపడుతున్న రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు ఫిబ్రవరి 12న ముగియనున్నాయి.



పోటీలను ప్రారంభిస్తున్న డికె అరుణ, విక్రంగౌడ్ తదితరులు

# కుయ్..కుయ్ రాస్తానై!

**అంబులెన్స్‌కే ఆపద • నగర ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న ఎమర్జెన్సీ వెహికల్స్ • గుంతలతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ • 108, ఇతర అంబులెన్స్‌లకు దొరకని దారి • బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో జాప్యం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
బోడుప్పల్‌కు చెందిన ఒక గర్భిణి గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌లో తీసుకొని ఆస్పత్రికి బయలుదేరారు. అప్పటికే రోడ్లపై భారీగా ట్రాఫిక్ రద్దీ ఉండటం, చాలాచోట్ల రహదారులపై గుంతలు ఉండడంతో వాహనాల వేగం నెమ్మదించింది. వాస్తవానికి15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన వాహనం అరగంటకు పైగా ట్రాఫిక్‌లోనే చిక్కుకుంది. అప్పటికే నొప్పులతో బాధపడుతున్న గర్భిణి అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించారు.ఇలా ఒక్క గర్భిణినే కాదు..108, ఇతర అంబులెన్స్‌లలో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్తున్న బాధితులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీనే ఇందుకు కారణమవుతోంది. ఓఆర్ఆర్ సహా శివారు జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులను అత్యవసర పరిస్థితుల్లో అస్పత్రులకు చేర్చే క్రమంలో అంబులెన్స్‌లకు ట్రాఫిక్ అడ్డంకిగా మారింది. అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోకపోవడంతో గర్భిణులు ఆయా వాహనాల్లోనే ప్రసవిస్తుండగా..అనారోగ్య బాధితులు మృత్యువాతపడుతున్నారు.

ఇటీవల నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌తో వాహనదారులు అల్లాడిపోతున్నారు. గ్రేటర్‌లో 80లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి. వీటిలో 30-40 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 వరకు ప్రధాన రహదారులు, వీధులూ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు, ఈనెల 11న ఫార్ములా ఈ రేసింగ్, 15 వరకు నుమాయిష్, 17న నూతన సచివాలయం ప్రారంభం, 18న శివరాత్రి వేడుకలు జరగనున్నాయి.ఇక కాలనీల్లో ప్రతి రోజూ కూరగాయల మార్కెట్లు, ప్రధాన మార్గాల్లో ఇష్టానుసారం చేరుతున్న తోపుడుబండ్లు, దుకాణాల వద్ద వాహనాలు నిలపడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ప్రతి రోజూ ఏదో ఒక సమస్యతో నగరంలో ట్రాఫిక్ కష్టలు పెరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు నిత్యం రోడ్లపైనే కనిపిస్తున్నా పరిస్థితిని చక్కదిద్దటం సవాలుగా మారింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పీక్ అవర్స్‌గా పేర్కొనే ఉదయం 8.30గంటల నుంచి 11 గంటల వరకు..మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2 గంటల వరకు..సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ సమయంలో నగరంలోకి వచ్చే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి.



సకాలంలో అస్పత్రికి చేరుకోకపోవడంతో పరిస్థితి విషమించి బాధితుల ప్రాణాల మీదకు వస్తోంది. వైద్య పరిభాషలో ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటారు. క్షతగాత్రులను ఈ సమయంలోపు ఆస్పత్రులకు తరలిస్తే వారు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. కానీ తరలింపులో జరుగుతున్న జాప్యంతో మరణాలు సంభవిస్తున్నాయి.

ఉప్పల్ నుండి వరంగల్ రహదారి, అంబర్‌పేట రోడ్డు, మలక్‌పేట, చాదర్‌ఘాట్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ, బోయిన్‌పల్లి సహా పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. పీక్ అవర్స్‌లో వాహనాలన్నీ ఒకేసారి రోడ్లపైకి వస్తుండడంతో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అవుతోంది. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలనే సామాజిక స్పృహ చాలా మంది వాహనదారుల్లో ఇప్పటికీ కొంత లేకపోవడంతోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫలితంగా 15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన అంబులెన్స్‌లు 30 నిమిషాలకు పైగా రోడ్లపైనే నిలిచిపోతున్నాయి.

గ్రేటర్ పరిధిలోని ఏడు జిల్లాల పరిధిలో దాదాపు 7,200 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సుమారు 150 కిలోమీటర్ల పొడవైన ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు పలు రాష్ట్రీయ జాతీయ రహదారులు దీనికి అనుకొని ఉన్నాయి. ఈ రహదారులపై ఏటా రెండు వేలకుపైగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో 200-300 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రధాన నగరంలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక 108 అంబులెన్స్ ఉండగా..అదే శివార్లలో ప్రతి 25-30 కిలోమీటర్లకు ఒకటి ఉంది. ఔటర్‌పై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్ ఘటనాస్థలికి చేరుకోవాలంటే కనీసం గంటకు పైగా పడుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత క్షతగాత్రులను ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రులకు తరలించడానికి మరో గంటకుపైగా పడుతోంది. ఇలా ఔటర్ నుంచి ఆస్పత్రులకు బాధితులను తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వరంగల్, జనగాం, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నుంచి వచ్చే ఇతర అంబులెన్స్‌లకు సిటీలో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రయాణ దూరానికి రోడ్లపై నిలిచిపోయిన ట్రాఫిక్ తోడవుతుండటంతో అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోవడం లేదు.

**108 అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు చేరే బాధితులు ఇలా..**

| | |
|---|---|
| క్షతగాత్రులు | 50 శాతం |
| గర్భిణులు | 30 శాతం |
| హృద్రోగులు | 5 శాతం |
| బ్రెయిన్‌స్ట్రోక్ బాధితులు | 5 శాతం |
| జ్వరపీడితులు, ఇతర రోగులు | 10 శాతం |



జివికె మాల్ ద హర్డ్ రాగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న జీన్ ఎరిక్ వెర్న్లే మరియు ఆర్ ఆంద్రీ లాటెరర్

## గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అలాగే పేదప్రజలకు ,కౌలు రైతులకు తన సొంత డబ్బులు దానం చేసి అండగా నిలిచిన బిసి బిడ్డ చక్రధర్ గౌడ్‌పై అక్రమ కేసును ఎత్తివేసి ఆయన్ను విడుదల చేశాయలని గౌడజనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు.ఈమేరకు గురువారం నగరంలోని జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గౌడకులస్తులకు ఆత్మగౌరవ భవనం పేరిట 5ఎకరాలు, 5కోట్ల నిధులు కేటాయించినప్పటికీ నేటి వరకు పనులు ప్రారంభించకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే భవననిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. అలాగే బిడ్డ చక్రధర్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసులను మోకుదెబ్బ తీవ్రంగా ఖండిస్తుందని భేషరతుగా విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని తొలగించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే విగ్రహాన్ని తొలగించిన చోటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత వృత్తి రక్షణ కోసం ,రాజ్యాధికారం కోసంగౌడ కులస్తుల ఐక్యంగా ఉద్యమించాలని నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములుగౌడ్, జాతీయ కోశాధికారి బాలేశంగౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యం నర్సింహులు, బాలసాని సురేష్, అనంతుల రమేష్, రాగుల కిరణ్‌గౌడ్, కదిరె ఆంజనేయులు గౌడ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సాగౌడ్ ,సిద్ధిరాములుగౌడ్ తదితరులు

## డా. సుద్దాల అశోక్‌తేజ రచనలు సమాజంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా. జి.రాధారాణి**



డా. సుద్దాల అశోక్‌తేజను జీవితసాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న జస్టిస్ డా. జి.రాధారాణి, రమణాచారి, వంశీరామరాజు, కృష్ణయ్య తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
అశోక్‌తేజ ఆయన ఊరిపేరును ఇంటిపేరుగా మార్చుకోవడం, ఆయన ఎదుగుదల ముఖ్యంగా రచించిన పాటలు, రచనలన్నీ ప్రతీఒక్కరికీ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా. జి.రాధారాణి అన్నారు. అశోక్‌తేజ 12వందల సినిమాలకు 2వేల పాటలు వ్రాయడమే కాకుండా ప్రైవేట్‌గా కూడా మరో 2వేల పాటలు, చాలా పుస్తకాలు రచించి గొప్పస్థాయికి చేరుకున్నా ఇప్పటికీ తన రచనలతో మనలో స్ఫూర్తిని నింపుతూనే ఉన్నారని, ఇదిలాగే పదికాలాలపాటు కొనసాగాలని ఆకాంక్షించారు. అశోక్‌తేజ అద్భుత రచనలతో ఎన్నో మకుటాయమానమైన అవార్డులను కైవసం చేసుకున్నారని, ఈ డా. కె.వి.రమణ జాతీయ జీవితసాఫల్య పురస్కారం కూడా ఆయన అవార్డుల సిగలో మకుటాయమానం కావాలని కోరుకుంటూ శుభాభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్ థియేటర్, శుభోదయం గ్రూప్ సంయుక్త నిర్వహణలో ప్రముఖ గేయరచయిత, జాతీయకవి డా. సుద్దాల అశోక్‌తేజకు డా. కె.వి.రమణ జాతీయ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రదాన మందిరంలో ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి జన్మదిన సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటుచేసిన ఈ పురస్కారాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు తంగెడ కిషన్‌రావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డా. జి.రాధారాణి, ప్రత్యేక అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, లత దంపతులు, విశిష్ట అతిథులుగా డా. బొల్లినేని కృష్ణయ్య, వంశీరామరాజు, రేలంగి నరసింహారావు తదితరులు పాల్గొనగా, సభకు వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డా. వంశీరామరాజు స్వాగతోపన్యాసంలో భోగరాజు పట్టాభి సీతారామరాజు, దేవులపల్లి, ఘంటసాల పేర్లమీద 3స్వర్ణపథకాలు, త్వరలో ఎస్పీబాలు పేరున 4వ స్వర్ణపథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా, ఆచార్య టి.కిషన్‌రావు అధ్యక్షోపన్యాసం కావించారు. అనంతరం ముఖ్యఅతిథి జస్టిస్ జి.రాధారాణి తదితర అతిథులతో కలిసి సుప్రసిద్ధ గేయరచయిత డా. సుద్దాల అశోక్‌తేజ, నిర్మల దంపతులను ఘనంగా సత్కరించి డా. కె.వి.రమణ జాతీయ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం డా. కె.వి.రమణాచారి, లత దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి ప్రసంగిస్తూ జాతీయ సుకవి సుద్దాల అశోక్‌తేజ అని ఆయన రచనలను ఉటంకించారు. తాను ప్రతీ సంవత్సరం జన్మదినోత్సవం జరుపుకోవడం నేపథ్యాన్ని సవివరపరిచారు. అశోక్‌తేజ ఇప్పటికే ఎన్నో మహోన్నతమైన గేయాలను వ్రాసారని, జాతీయస్థాయికి ఎదిగారని, ఇకముందు మరిన్ని అత్యున్నత శిఖరాలు అధిరోహించడానికి ప్రోత్సాహకమే ఈరోజు ఆయనకిస్తున్న ఈ జాతీయ జీవన సాఫల్య పురస్కారమని స్పష్టం చేశారు. సభకుముందు జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ గాయని ఊటుకూరి భూదేవి నేతృత్వంలో పలువురు వర్ధమాన గాయకుల సంగీత విభావరి వీనులవిందుగా సాగి ఆహుతులను మైమరపించింది.

# ఏదీ ఉక్కుపాదం ..!

**-పెట్రోల్ బంకుల్లో తూతూమంత్రంగా తనిఖీలు**
**-మీటర్ మోసాలతో వినియోగదారులను కుచ్చుకోపి**
**- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న తూనికలు కొలతలశాఖ**



**హైదరాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
వాహనాలు పెరిగాయి..పెట్రో ఉత్పత్తుల వాడకమూ పెరిగింది. ప్రస్తుతం ధనిక పేద అనే తేడా లేకుండా పెట్రోల్, డీజిల్, ప్రతి ఒక్కరికీ నిత్యావసరాలుగా మారాయి.ప్రతి ఒక్కరూ ఏదోఒక వాహనం వినియోగిస్తూనే ఉన్నారు. వాటితో పాటు రవాణాకోసం నగర వ్యాప్తంగా అనేక రకాల వాహనాలు తిరుగతాయి. దీంతో ఇంధన వినియోగం రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుంది. ఈక్రమంలో వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు పెట్రోల్ బంక్ డీలర్లు, బంకుల యజమానులు అక్రమాలకు పాల్పడుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఇటీవల సైబరాబాద్ పోలీసులు నగరంలోని పలు పెట్రోల్ బంకులపై దాడులు చేసి 12బంకులను సీజ్ చేశారు. వీరు బంక్‌ల్లో చిప్‌లు పెట్టి కొలతల్లో తేడాలు సృష్టిస్తున్నట్లు గుర్తించారు. అయితే బంకులపై నిత్యం నిఘా వేయాల్సిన తూనికలు కొలతల శాఖ మాత్రం తమకేమీ పట్టనట్లుగా ఉంటుంది. ఉన్నతాధికారుల ఒత్తిడితోనో...రికార్డుల్లో నమోదు చేసేందుకో నామమాత్రపు దాడులు చేసి కేసులు నమోదు చేయకుండా చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పెట్రోల్ బంకుల యజమానుల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. తూనికలు కొలతల అధికారుల లెక్కల ప్రకారం హైదరాబాద్,రంగారెడ్డి పరిధిలో 500లకు పైగా పెట్రోల్ బంకులు ఉంటే అందులో హైదరాబాద్‌లో 178కాగా, రంగారెడ్డి పరిధిలో దాదాపు 330వరకు ఉంటాయి.

**బంకుల్లో కనిపించని కొలమానాలు..**

హైదరాబాద్ పరిధిలోని పెట్రోల్‌బంకుల్లో సగానికిపైగా అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా బంకుల్లో కొలమానాలు లేని పరిస్థితి కనిపిస్తుంది.పెట్రోల్ డీజిల్ పోయించుకునేటప్పుడు వినియోగదారుడికి కల్తీ జరిగినట్లు అనుమానం వచ్చినా, తక్కువ కొట్టినట్లు అనిపించినా చెక్ చేసుకునేందుకు ప్రతి బంకులోనూ నిర్వాహకులు పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం ఫిల్టర్ టెస్ట్ పేపర్‌ను ,డెన్సిటీ హైడ్రోమీటర్, 5లీటర్ల కొలమానం ప్రతి బంకులో అందుబాటులో ఉంచాలి. ఏవినియోగదారుడు అడిగినా నిర్వాహకులు తప్పనిసరిగా వీటిని అందజేయాలి. కానీ ఎక్కడా ఆయా పరికరాలు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. ఒకవేళ ఎవరైనా వినియోగదారుడు తప్పనిసరిగా కావాలని అడిగితే నీకు ఇష్టమైతే పోయించుకో లేకుంటే లదు అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని వాపోతున్నారు.

**వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

బంకుల్లో వెళ్లినప్పుడు వినియోగదారులు ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా గమనించాలి. వాహనాల్లో పెట్రోల్ పోయించుకునే ముందు తప్పనిసరిగా ఎన్సార్‌పై జీరో అయిందో లేదో చూసుకోవాలి. పెట్రోల్ యంత్రంపై తూనికలు, కొలతలు శాఖ ముద్రను గమనించాలి. పెట్రోల్‌లో వైట్ పెట్రోల్, నాఫ్తా, కిరోసిన్ కలిపే అవకాశం ఉంది. అనుమానం వస్తే వెంటనే పెట్రోల్ పేపర్‌ను తీసుకుని పరిశీలించాలి. పెట్రోల్,డీజిల్‌పై అనుమానం వస్తే డెన్సిటీ హైడ్రోమీటర్ ఇవ్వకుంటే తప్పనిసరిగా ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఎలక్ట్రానిక్ మిషన్‌లో టాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున అనుమానం వస్తే తప్పనిసరిగా కొలమానం అడిగి తీసుకొని కొలవాలి.

## కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**..మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్ అమోయ్‌కుమార్**

**హైదరాబాద్ ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**
కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు (జాతరకు) అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండ తగు వసతులు కల్పించాలని మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్ ఆమోయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా కీసరగుట్టను జిల్లా కలెక్టర్ సందర్శించి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని జాతర ఏర్పాట్లపై ప్రాంగణంలో అంత పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్‌లు,సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ ఆమోయ్‌కుమార్ మాట్లాడుతూ కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను విజయవంతంగ నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఉండి తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి 21వరకు జరుగనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు క్యూలైన్, పార్కింగ్, స్థలాలను పరిశీలించటం జరిగిందన్నారు. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి పండుగ సందర్భంగ భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున ఆయాశాఖల అధికారులు సమన్వయంతో ఉండి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు ఈ సంవత్సరం గుట్టకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవటానికి హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆమోయ్‌కుమార్ సూచించారు. జాతరకు వచ్చె భక్తులు స్నానాలకు స్నానపు గదులు, మహిళలకు ప్రత్యేకంగ షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండ చూడాలన్నారు. బ్యారికేడ్స్, దర్శనం క్యూలైన్, పార్కింగ్‌కు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండలు పెరుగుతున్నందున త్రాగునీటి సౌకర్యం కూడ పెంచాలన్నారు.జాతర ప్రాంగణం అంత కూడ పరిశుభ్రతకు స్వచ్ఛ వాతావరణం ఉండేలా చూడాలన్నారు. అత్యవసర ఆరోగ్యసేవలకు శిబిరాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. భక్తుల కోసం ప్రత్యేకంగ బస్సులు నడపటానికి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజా సామాగ్రి, ఆహారపదార్థాల నుంచి అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాతర సమయంలో అగ్నిమాపక సిబ్బంది,ఫైరింజన్ అందుబాటులో ఉండాలన్నారు. జాతరకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి అధికారులు తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. ఈ జాతరను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉండి విజయవంతం చేయాలని కలెక్టర్ అమోయ్‌కుమార్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, కీసర ఆర్డీఓ రవి, కీసరగుట్ట ఆలయ చైర్మన్ రమేశ్‌శర్మ, ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచు మాధురి, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో దారుణం...

**నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య**

**సైబరాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
నడిరోడ్డు మీద అందరూ చూస్తుండగా గుర్తు తెలియని దుండగులు గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. మియాపూర్‌లో ప్రధాన రహదారి మీద ఉన్న బస్టాండ్‌లో జరిగిన ఈ ఘటనలో తలపై తీవ్ర గాయాలైన గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మద్యం మత్తులో చోటుచేసుకున్న వివాదంతోనే ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మియాపూర్ ప్రధాన రహదారి మీద ఉన్న బస్టాండులో బుధవారం రాత్రి కొందమంది మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఓ వ్యక్తిని రాయితో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలైన సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మద్యం తాగిన తరువాత ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వివాదమే హత్యకు దారి తీసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి ఆచూకి లభించలేదని, బీహార్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. దీంతో పాటు నిందితుల ఆచూకీ సైతం లభించలేదని, అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.



కారా ్ఖనలో కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి

## కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

### మర్రి రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కార్ఖానలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మర్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ యాదవ్, రాజుసింగ్, కంటోన్మెంట్ ఎస్‌పిహెచ్ఓరాజకుమారి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి : టిఎన్



గన్‌బజార్‌లో కంటివెలుగు సెంటర్‌ను సందర్శించిన టీ.ఎన్.శ్రీనివాస్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** సిఎం కేసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో ప్రతిఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకోవాలని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం 2వ వార్డు రసూల్‌పుర, గన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టీఎన్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాల్లో వైద్యసిబ్బందికి, రోగులకు ఏమైన సమస్యలు ఉంటే ఎమ్మెల్యే సాయన్న సహాయ సహకారాలతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుష్మ, డాక్టర్ వనలత పాల్గొన్నారు.

## పెళ్లిళ్ల సీజన్‌లో ఆర్టీసి అద్దె బస్సులపై 10 శాతం రాయితీ

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** శుభకార్యాలకు, పెళ్లిళ్లకు అద్దె బస్సులను బుక్‌చేసుకుంటే ప్రత్యేక రాయితీ కల్పించేందుకు ఆర్టీసి యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇ.యాదగిరి తెలిపారు. గురువారం జెబిఎస్‌లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుభకార్యాలకు ఆర్టీసి అద్దెబస్సు లపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నామన్నారు. అన్నిరకాల బస్సులపై రాయితీ వర్తిస్తుందన్నారు. కార్తీకమాసం, వనభోజనాలు, శబరిమలై అయ్యప్ప దర్శనార్థం వెళ్లేవారు బసు ్సలను బుక్ చేసుకుంటే రాయిలీ కల్పిస్తామన్నారు. ఈ రాయితీ వచ్చే జూన్ 30 వరకువర్థిస్తుందన్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్



గ్యార్వీ వేడుకల్లో పాల్గొన్న శ్రీలతశోభన్‌రెడ్డి, శోభన్‌రెడ్డి

**తార్నాక, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట్‌లో లతీఫ్, జునేద్ నిర్వహించిన గ్యార్వీషరీఫ్ వేడుకల్లో నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బేతి శుభాష్‌రెడ్డిలను నిర్వాహకులు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వావరు మాట్లాడుతూ గ్యార్వీ షరీఫ్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిల్లాని స్మారకార్థం ఇస్లామిక్ సూఫి పండుగ అన్నారు. ఖాద్రి తారీఖా శ్రేయేభిలాషి అని ఆయన ప్రపంచం మొత్తం వర్ధిల్లుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి వెంకటేష్, సునిల్ ముదిరాజ్, ఖాజా పాష, ఎర్ర నాగు, ఫయాక్ పాల్గొన్నారు.

## దేవాలయాల ఉద్యోగులపై రాజకీయ నాయకుల పెత్తనం సహించేది లేదు: అర్చక జెఏసి



నిరసన తెలుపుతున్న హనుమాన్ దేవాలయం అర్చకులు, సిబ్బంది

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దేవాలయాల్లో గల ఉద్యోగులపై రాజకీయ నాయకులు పెత్తనం చెలాయించాలని చూస్తే సహించేది లేదని తెలంగాణా రాష్ట్ర అర్చక ఉద్యోగుల జెఏసి గౌరవ సలహాదారులు కుర్మేటి అంబయ్య, ఉపాధ్యక్షుడు కందాళ సంతోష్ కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమతపై అధికార పార్టీకి చెందిన వేణు చేసిన అనుచిత వ్యాఖ్యాలతో తీవ్ర మనస్థాపానికి గురై సమత ఆత్మహత్య ప్రయత్నం చేసిందని, దీనికి కారకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం అర్చకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాల శంకర్‌శర్మ, ఎస్.అంబాప్రసాద్, ఎస్.రాజు, శ్రవణ్, పీతాంబరాచార్యులు, ప్రవీణ్, రాఘవాచార్యులు, సిబ్బంది వెంకటయ్య, నర్సింగ్‌రావు, యాదగిరి, సంతోష్, వనిత తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండవగా సాగిన సహస్ర లింగార్చన

**నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**

మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడ మల్లిఖార్జున స్వామి ఆలయంలో సహస్ర లింగార్చన, ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీశ్రీశ్రీ శక్తి శివానంద స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలలో వందలాది మంది భక్తజనం పాల్గొని తరించారు. ఆలయమంతా శివనామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నిత్యం భగవన్నామ స్మరణం చేయడం వలన సర్వ పాపాలు హరించుకుపోతాయన్నారు. ప్రతీ ఒక్కరూ రోజూ దేవాలయాలకు వెళ్లాలని, అక్కడ మనలో నూతనోత్తేజం వస్తుందన్నారు. శారీరక, మానిసి అలసటలన్నీ మాయం అవుతాయన్నారు. మన పూర్వీకులు ఏది మనం ఆచరిస్తే మేలు జరుగుతుందో అదే ఆచరించాలని పండగలు, పర్వదినాలు, పూజలను ఏర్పాటు చేశారన్నారు. వేల ఏళ్ల నుంచే మనదేశంలో గ్రహాల కదలికలను లెక్కగట్టి వారి గమనాన్ని బట్టి పూజలు చేయడం ప్రారంభించారన్నారు. ఆధ్యాత్మికత వైపు యువత పెద్ద ఎత్తున మరలుతుండడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్ధోలు శ్రీరాములు, నాయకులు శ్రావణ్, గంగాధర్‌లతో పాటు వందలాది మంది శివ భక్తులు పాల్గొన్నారు.

# రోడ్లు, ఫ్లైఓవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద్

**నిజాంపేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగించారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, జంక్షన్లు, ఫ్లైఓవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌కు విన్న వించారు. స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఆర్‌డిపి) ద్వారా నగర నలమూలల్లో చేపడుతున్న ఫ్లైఓవర్లు రోడ్ల అభివృద్ధి పనులు మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి సిఖ్‌విలేజ్ మీదుగా బోయిన్‌పల్లి వరకు, ప్యాట్నీ నుంచి కరీం నగర్‌కు వెళ్ళే రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ఈ రహదారులు డిఫెన్స్‌వారి ఆధీనంలో ఉన్నందున ఎస్ఆర్‌డీపీ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి డిఫెన్స్‌వారి నుంచి అనుమతి వచ్చే విధంగా చొరవ తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు.

అదేవిధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ నుంచి జెఎన్‌టీయూ వరకు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నా యని, ఎస్ఆర్‌డీపీ ద్వారా ఫ్లైఓవర్ చేపడితే బాచు పల్లి, ప్రగతినగర్, భౌరంపేట్, మల్లంపేట్ ప్రాంత ప్రజలకు వెసలుబాటు కలుగుతుందని కేటీఆర్‌ను కోరారు. సుభాష్‌నగర్ ఫైప్‌లైన్ రోడ్డులో స్టీలు బ్రిడ్జి నిర్మాణానికి రూ.56కోట్ల నిధులు, మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు రోడ్డు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కరించామని, మరికొన్ని అభివృద్ధి పనులు కూడా త్వరలో పూర్తి చేసి హైదరాబాద్ నగర ప్రజలకు పూర్తి స్థాయిలో ఎస్ఆర్‌డీపీ ఫలాలు అందిస్తామన్నారు.

భాగ్యనగరం ట్రాఫిక్ సమస్యలు అధిగమించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 8 ఏళ్లుగా రక్షణశాఖ, ప్రధాన మంత్రికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం భాధాకరమన్నారు. ప్యాట్నీ నుంచి సుచిత్ర వరకు స్కైవే ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం సహకరించడంలేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజల అవసరాల మేరకు చేపట్టే పనుల విషయంలో వివక్ష చూపకుండా స్వాగతించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## యువత స్వయంశక్తితో ఎదగాలి

### మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం శక్తితో ఉపాధి పొందేవిధంగా ముందుకు రావడం అభినందనీయమని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనువాస్‌రెడ్డి అన్నారు. గురువారం మోతీనగర్ ప్రాంతంలోని బాలాజి స్వర్ణపురికాలనీలో 90ఎస్ గోదావరి కిచెన్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కాలయాపన చేయకుండా స్వశక్తితో వారిలో ఉన్న నైపుణ్యాన్ని ఉపయోగించుకుని నలుగురికి ఉపయోగపడే విధంగా వారి కాళ్లపై వారు నిలబడే విధంగా వ్యాపారాలు చేసుకోవడం అభినందించే విషయమని అన్నారు. వినియోగదారులకు నాణ్యతతో కూడిన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వి.గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక ఉత్పత్తులకు ప్రభుత్వం పెద్దపీట

### ప్రభుత్వ సలహాదారు రమణాచారి



వివిధ రంగాలకు చెందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** స్థానిక ఉత్పత్తులను ఉపయోగించి స్థానికులకు అండగా నిలుద్దామని ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, ఎల్‌బినగర్ డిసిపి బత్తిని సాయిశ్రీ అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం చైర్మన్ భరత్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వివిధ రంగాలకు చెందిన కళాకారులు, ఆదర్శ రైతులు, త్రివర్ణ దళాలకు చెందిన పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌బినగర్ డిసిపి సాయిశ్రీ, వనస్థలిపురం ఎసిపి పురుషోత్తంరెడ్డి, ఎల్‌బినగర్ ఎసిపి శ్రీధర్‌రెడ్డి, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, డిఐ సైదులుతో కలిసి ప్రభుత్వ సలహాదారు రమణాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వ సలహాదారు రమణాచారి మాట్లాడుతూ స్థానిక ఉత్పత్తులకు పెద్దపీట వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట కమీషనర్ నాగేశ్వర్, కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వీఎన్ఆర్‌విజేఐఈటీలో స్పోర్ట్స్‌ఫెస్ట్ ప్రారంభం.

**నిజాంపేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 14వ అఖిల భారత స్పోర్ట్స్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. ఈ ఫెస్ట్‌కు ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహిత చేతన్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యమ్రాన్ని ప్రారంభించారు. వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి కళాశాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 52 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీరామ తెలిపారు. ఈ సందర్భంగా చేతన్ ఆనంద్ మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణతో ఏ క్రీడల్లోనైనా రాణించవచ్చునని, అప్పటి తరంతో పోలిస్తే ఇప్పుడు క్రీడారంగంలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కళాశాల, రాష్ట్రస్థాయిని దాటి జాతీయ స్థాయిలో పోటీపడేందుకు కృషి చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడల విషయంలో అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నందుకు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకుడు డా.సి.డి.నాయుడు, డా.బి.చెన్నకేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రసాయనాల నీటితో కలుషితమవుతున్న కోకాపేట్ కొత్త చెరువు

**నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** గండిపేట్ మండలంలోని కోకాపేట్ గ్రామంలో ఉన్న కొత్త చెరువు రసాయన నీటితో కలుషితం అవుతుందని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సిహ్మా పేర్కొన్నారు. గురువారం కోకాపేట్ కొత్త చెరువులో కలుస్తున్న రసాయన పదార్థాలు, కలుషిత నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సిహ్మా మాట్లాడుతూ చెరువులోకి రసానాలు కలిసిన నీటిని వదులుతన్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, చెరువును కబ్జా చేస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కొత్త చెరువును శాటిలైట్ ద్వారా సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కోకాపేట్‌లో ఏర్పడిన ఐటీ కంపనీలు చెరువు స్థలంను కబ్జా చేస్తున్నాయని ఆరోపించారు. ఈ చెరువులోకి కలుషిత నీటిని వదిలిపెట్టడం వలన 5.కేజీల చేపలు సైతం చనిపోయాయని, ఇప్పటి వరకు రూ.15లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. చెరువు మధ్యలో నుంచి వాకింగట్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడం మానుకోవాలన్నారు. 85.ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు ఇప్పుడు 40.ఎకరాలకు కుదించబడిందని, దీన్ని కాపాడడంలో ఇరిగేషన్ శాఖ అలసత్వం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెరువు స్థలంను కాపాడేందుకు సర్వే చేసి హద్దులు పాతాలని లేదంటే వేలాది మంది మత్స్యకారులతో ఇరిగేషన్ కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నీరటి మల్లేష్, స్థానిక సొసైటీ అధ్యక్షులు ఖానపురం నారాయణ, ఉపాధ్యక్షులు రమేష్, రాయదుర్గం అధ్యక్షులు సురేందర్, కార్యదర్శి శ్రీశైలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి చికిత్సాలయాన్ని సందర్శించిన బాలీవుడ్ నటుడు సోనూసూద్

## ప్రకృతి చికిత్సాలయాన్ని సందర్శించిన బాలీవుడ్ నటుడు

**సంజీవరెడ్డినగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** బాలీవుడ్ నటుడు సోనూసూద్ గురువారం హైదరాబాద్‌లోని ప్రకృతి చికిత్సా లయం(నేచర్‌క్యూర్)ను సందర్శించారు. ఆస్పత్రిలో తిరుగుతూ కాటేజీలు, మెస్, యోగా ప్రాంగణాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలగురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సోనూసూద్‌తోపాటు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు టీఎస్ఎమ్ఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, ఆయూష్ కమిషనర్ ప్రశాంతీలతో పాటు నేచర్ క్యూర్ హాస్పెటల్ సిబ్బంది విద్యార్థులు ఉన్నారు. ఆస్పత్రి ఆవరణలో సోనూసూద్ సంపంగి మొక్కలను నాటారు. అనంతరం వైద్యులు, విద్యార్థులను ఉద్దేశించి సోనూసూద్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి హరీష్‌రావులపై ప్రశంసలజల్లు కురిపించారు. ఆరోగ్య తెలంగాణ దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్న తీరు చాలా బాగుందని పేర్కొన్నారు. కరోనా కాలంలో ఇబ్బంది పడ్డ జనాలకు సోనూసూదు ఆపన్నహస్తం అందించిన విషయం తెలిసిందే తన ఆస్తులను తాకట్టు పెట్టిమరీ పేదలను ఆయన ఆదుకున్నారు. ఇప్పటికీ తన ఫౌండేషన్ ద్వారా సేవాకార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

## నిర్బంధాలను లెక్కచేయం... అసెంబ్లీని ముట్టడించి తీరుతాం :

### తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ సంఘాల జెఏసి

**నాంపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఆటోడ్రైవర్లంతా బడుగు బలహీనవర్గాలకు చెందినవారే, అనునిత్యం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, అనిశ్చిత ఆదాయంతో ఆటోడ్రైవర్ల జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయని, తమ సమస్యల పరిష్కారానికి న్యాయమైన కోర్కెల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎన్నిరకాల నిర్బంధాలను విధించినా లెక్కచేయమని, ఛలో అసెంబ్లీ నిర్వహించి అసెంబ్లీని ముట్టడించి తీరుతామని తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ సంఘాల జెఏసి నేతలు బి.వెంకటేశం, ఆర్.మల్లేషం, అమానుల్లాఖాన్, వి.కిరణ్, వి.మారయ్య. ఎ.సత్తిరెడ్డి, జి.మల్లేష్, ఎంఎ.సలీం తదితర నాయకులు హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జెఏసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రమేర్పడిన నాటినుండి నేటివరకు ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించలేదని, కనీసం సమాజంలో మనుషులుగా పరిగణించడంలేదని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. గత 9సంవత్సరాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి భరించలేదని దుస్థితిలో ఉన్నామని, ప్రభుత్వం కనీసం మీటరు చార్జీలు కూడా పెంచలేదని, పెరిగిన ఇంధన, నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని, ఆటోడ్రైవర్ల సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని, నిరుద్యోగ యువత ఉపాధికోసం కొత్త ఆటోపర్మిట్లను జారీచేయాలని, ఏపిలో మాదిరి ప్రతీ ఆటోడ్రైవర్‌కు 10వేలు, ప్రతీ సంవత్సరం ఆటో ఇన్సూరెన్స్ తదితర ఖర్చుల కోసం ఆటోబంధు ప్రవేశపెట్టాలని, భారీగా పెరిగిన ఇన్సూరెన్స్ చార్జీలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. రేపు 10 శుక్రవారం ఉదయం 11గంటలకు జెఏసి ఛలో అసెంబ్లీ ప్రారంభమౌతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది ఆటోడ్రైవర్లు తరలివచ్చి తమ డిమాండ్ల సాధన ఛలో అసెంబ్లీని విజయవంతం చేయాలని, పోలీసులు ఎక్కడాపితే అక్కడే నిరసనలు తెలుపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ క్యాబ్‌డ్రైవర్స్ సంఘాధ్యక్షుడు టి.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్‌గౌడ్, జెఏసి నగర నేతలు ఆర్.మల్లేష్, ఒమర్‌ఖాన్, కొమరెవెల్లి బాబు, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



డిసిపి సాయిశ్రీని సన్మానిస్తున్న యాదగిరి

## ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ

సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: శాంతిభద్రతలు కాపాడడంలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతైనా అవసరమని ఎల్‌బినగర్ డిసిపి సాయిశ్రీ అన్నారు. ఎల్‌బినగర్ డిసిపిగా నూతనంగా నియమితులైన బత్తిన సాయిశ్రీ గౌడ్‌ను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో సిసి కెమరాలు ఏరా ్పటు చేసి ఎలాంటి నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టి నేర రహితంగా మార్చడానికి కృషి చేస్తామని అన్నారు. పోలీసు యంత్రాంగం అహర్నిషలు ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులతో సహకరించాలని, యువత సన్మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాలోకెల్లా అన్నదానం గొప్పది : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని, అందువల్ల ఆకలి మంటలతో అలమటిస్తున్న పేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. సంకటహార చతుర్థిని పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లి చౌరస్తాలోని విద్యా గణపతి ఆలయంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విఆర్ ఆసుపత్రి ఎండి నందకిషోర్, నాయకులు రాముగౌడ్, నాగరాజు, రఘచరణ్, వరప్రసాద్, గోవర్ధన్, పెరుక మహేందర్ పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : శ్రీగణేష్

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రజానాయకుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు 7వ వార్డు తిరుమలగిరి చిన్న కమేలాలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన కల్లు, గుడాలు వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటుచేసిన అన్నదానకార్యక్రమాన్ని ప్రారంభించారు.

## నేటి నుంచి మలక్‌పేటలో ప్రజా గోస-బిజెపి భరోసా సమావేశాలు

**మలక్‌పేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గంలో ఈ నెల 10వ తేది నుంచి 25వ తేది వరకు ప్రజా గోస-బిజెపి భరోసా కార్నర్ సమావేశాలను నిర్వహిసు ్తన్నటు ్ల భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మలక్‌పేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలక్‌పేటలోని అన్ని శక్తి కేంద్రాలలో సుమారు 100 సమావేశాలను నిర్వహించనున ్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, మలక్‌పేట నియోజకవర్గంలోని మూసారాంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీలో మొదటి బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

భాగ్యనగర్ జిల్లా పరిధిలో సుమారు 400ల బహిరంగ సభలు జరుగుతాయన్నారు. తెలంగాణాలో అవినీతిమయమైన కుటుంబ పాలనను అంతం చేయాలన్నారు. రాష్ట్రం లో బిజెపిని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.


**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II, AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD**

**OA NO 947 OF 2022**

**Between:**
**UNION BANK OF INDIA**
**EX – ANDHRA BANK**
**(KUKATPALLY PBB BRANCH)**
**...APPLICANTS**
**AND**
**M/s SAGAR INDUSTRIES**
**....DEFENDANTS**

**To,**
1. **M/s SAGAR INDUSTRIES** Partner :Smt P Devi ,H No 8-95, Gowtham Nagar,Ferozguda, Secunderabad 500011.
2. **SMT P DEVI** Partner M/s SAGAR INDUSTRIES H No 8-95, Gowtham Nagar, Ferozguda, Secunderabad 500011.
3. **SRI P VEERASWAMY** Partner M/s SAGAR INDUSTRIES, H No 8-95, Gowtham Nagar, Ferozguda, Secunderabad 500011.

Please take the summons in the above OA NO 947 OF 2022 filed by the applicant for recovery of money of **RS. 31,08,291.91 ps** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"Vaartha"** daily newspaper and posted the matter to 23.03.2023 .

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **23.03.2023** at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 09th of January, 2023.

**(By order of the Court)**
**Registrar**
**Debts Recovery Tribunal - II**
**Hyderabad**

**IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE, CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**I.A.No. 1407 of 2022**
**IN**
**OS.No.4653 OF 2022**
Between:
**Jamia Ilahiyat e Nooria**, Represented by Secretary **Dr. S.M. Nasiruddin Jeelani Sahab** S/o Late Syed Ahmed Mohiuddin Jeelani @Syed Noori Shah Aged about 65 years, R/o H.No.18-13-124/B, Noori Maskan, Bandlaguda, Hyderabad ....Plaintiff
**AND**
**M. Shivaji** S/o Late Sri M. Khurana, R/o Plot No.55, Mithilanagar, Road No.12, Banjara Hills, Hyd.,T.S. Also R/o H.No.5-8-107, Nampally Station Rd., Hyd. TS....Defendant
**NOTICE**
Please take Notice that the plaintiff has filed a suit for Eviction and Arrears of Rent Mesne Profits and Damages against you and other the case is posted on 21-02-2023. for your appearance. as such you are hereby directed to appear in person or though Advocate on 21-02- 2023. At 10:30 AM Before the above Hon'ble court failing which the matter will be decided as per Law.
//BY ORDER OF THE COURT//
HYDERABAD Date: 07-02-2023
(M.A.K. MUKHEED)
MOHD. ASIF VAKALAT UNNISA
Advocates
#Flat No.201, 2nd Floor, Maa Gayathri Plaza, Beside Indian Bank Barkatpura, Hyderabad
Email:mukheedmak@yahoo.com
Cell: 9848933601

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
**డివిజన్-14, GHMC**

నిట్ నెం.116/E.E.14/GHMC/2022-23, తేదీ: 09.02.2023. పనిపేరు: GHMC, KZ, డివిజన్ నెం.14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా విలువ/ECV (రూ.లక్షలలో): 162.35. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ మరియు సమయం: 10.02.2023న మ.3.00గం.లు. 20.02.2023న మ.03.00గం.లు. అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్, నెం.9989930428. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్: www.tender.telangana.gov.in నుండి పొందగలరు.
DIPR.No.12391-PP/CL/Advt/1/2022-23 తేదీ: 09.02.2023 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్-14, GHMC.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
**నోటిఫికేషన్**

నిట్ నెం.115/EE/C14/GHMC/KZ/2022-23. తేదీ: 08.02.2023. పనిపేరు: GHMC, యందు ప్రస్తుతమున్న (3460) శాశ్వత ఉద్యోగులకు (1+5) కుటుంబ సభ్యుల కవరేజితో హామీ మొత్తం రూ.3.00 లక్షలు. బఫర్ లిమిట్ రూ.1.00 కోట్లతో 1 సంవత్సర కాలానికిగాను గ్రూప్ మెడిక్లెయిమ్ ఇన్సూరెన్స్ పాలసీని కలుగజేయుటకు "కొటేషన్ల ఆహ్వానం"లు ఆహ్వానించబడుచున్నవి. (3వ పిలుపు). టెండరు నోటిఫికేషను/బిడ్ పిలుపు తేదీ: 09.02.2023న ఉ.11.00గం.లు. బిడ్ సమర్పణకు ద్వా తేదీ మరియు సమయం: 14.02.2023న ఉ.11.00గం.లు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (tender.telangana.gov.in)పై ప్రీ-క్వాలిఫికేషన్ మరియు సాంకేతిక బిడ్లు తెరుచుట: 14.02.2023న ఉ.11.30 గం.లు. కావున ఆర్హత గల ఇన్సూరెన్స్ కన్సల్టెంట్లు వారి కొటేషన్ల ప్యాకేజీలను పైన తెలిపిన సమయానికి సమర్పించగలరు.
DIPR.No.12385-PP/CL/Advt/1/2022-23 తేదీ: 09.02.2023 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్-14, GHMC.

**PUBLIC NOTICE**

General Public are hereby informed that my client **SRI.GUTHA SUJAN REDDY S/o. DEVENDER REDDY,** resident of H.No.16-10-228/7/7, Old Malakpet, Hyderabad has entered into an Agreement of Sale to purchase the Plot No.155 admeasuring 200 Sq.Yards, in Survey Nos. 346 to 354 & 355, Situated at Narsingi Village, Gandipet Mandal, Ranga Reddy District, bounded by East: Plot No.158, West: 30 feet Road, South: Plot No.156, North:Plot No.154 from its owner K Chakravarthy Yadav S/o.Late Lakshminarayan Yadav, R/o. 8-3-166 Part A, Gokul Theatre Compound, Erragadda, Hyderabad, executed by his agreement holder K Venu Kumar S/o.Ramulu R/o. Narsingi Village, Ranga Reddy District, by paying substantial amount as advance. If any person or persons having any claims & objections in respect of above sale transaction shall approach undersigned with all relevant documents in support of their claims within 7 days from the date of Publication of this notice. Objections received thereafter will not be entertained and my client will get registered sale deed in his favour.

**Sd/- K.V.KONDAL RAO,**
Advocate
Sudharshan Enclave,
Alakapuri Colony, SRK Puram,
Hyderabad- 500035.
**Cell No.8374232138.**

**IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S.NO.1051 OF 2018**
**Between:**
M/s ICICI Bank Limited
Having its branch office at 5-9-2, JVL Towers, Opp.Assembly, Saifabad, Hyderabad. Rep., by its Collection Manager & G.P.A.Holder, Sri Sundeep A, S/o. ManikPrabhu, Aged: 38 Years, Occ: Collection Manager, R/o. Hyderabad.
**...Plaintiff**
**AND**
Jessica Lazarus
**..... Defendant**
To,
Jessica Lazarus, S/D/O.Lazarus, Aged: about: 31 Years, Occ; Private Employee, R/o # 11-03-664/238/A/75 Parsigutta, Hyderabad-500061.
The Plaintiff has filed the above orginal suit for recovery of money against you and the said matter is posted to 28-02-2023 for your appearance. You are therefore hereby directed to appear before this Hon'ble court on the above said date at 10.30 A.M. either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.
//BY ORDER OF THE HONOURABLE COURT//
**Sd/- G.KALYAN CHAKRAVARTHY,**
Advocate
#H.No.6-3-1099/14 & 15, Lake Melody Apartment, Flat No.301, 3rd Floor, Lane Next to Park Hotel, Raj Bhavan Road, Somajiguda,Hyderabad-82

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.NO.3047 OF 2021**
**Between:**
Canara Bank, Pathergatty Branch, Hyderabad
**...Plaintiff**
**AND**
M.Vijay Singh and other
**..... Defendants**
01.M.Vijay Singh, S/o.Sri Prasad Singh, D.No.13-3-765/A/1, Opp: Gopi Hotel Lane, Jiyaguda, Hyderabad-500 006.
02.Vishwa Raj Hotker, S/o.Sri Kolloshpodi Hotker, D.No.13-3-56/16, MCH Colony Road, Jiyaguda Near Sona & Sona Hotel, Hyderabad- 500 006.
The Plaintiff above named filed the above suit for recovery of money against the Defendants and the matter now posted to 23.02.2023 for your appearance. If you fail to appear before the Honorable Court on 23.02.2023 at 10.30 A.M. either in person or through Counsel the matter will be decided in your absence.
//BY ORDER OF THE COURT//
**Sd/-M/s. DISHIT BHATTACHARJEE**
**B.SATISH**
Advocates
Flat No.101 and 102, Nirman Tower East Marredpally, Secunderabad- 500 026.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSION JUDGE, R.R.DISTRICT, AT:L.B.NAGAR.**
**I.A.NO.1916 OF 2022**
**IN**
**CMA SR .NO.11901 OF 2022**
**Between:**
Smt.Bharathi Bai & Others,
**...Petitioners/Appellants**
**AND**
Mr.Yadilal Karankati & Others,
**..... Respondents/Respondents**
To,
Mr.Kiran Karankati, S/o.Yadilal Karankati, aged:about 40 years, Occ: Business, R/o.H.No.13-3-960/3/A, Indira Nagar, Jiyaguda, Hyderabad, T.S.
Sir,
Take Notice that the above IA is filed by the Petitioner to condone the delay in the above CMA Sr No.11901/2022 and the same is posted to 15-03-2023 for your appearance. Kindly be present either in person or through advocate at 10.30 A.M. before the said Hon'ble court or else the matter will be decided in accordance with law.
**//BY ORDER OF THE COURT//**
**Sd/- (MOHAMMED SHUJAUDDIN)**
Advocate
Off:16-7-311/2, Opp: Sahifa Masjid, Azampura, Hyd-24,
**M-9000007006.**

**PUBLIC NOTICE**
**(LOSS OF ORIGINAL SALE DEED)**

My Client **MR.P.SURYA NARAYANA MURTHY,** S/o. **LATE SRI. RAMAKRISHNA MURTHY,** Aged: about 80 Years, Occ: Retd. Teacher (Cell No.9347502345) who is permanent Resident of Tanuku, Andhra Pradesh, Presently Staying with his son Mr.PRK Murthy R/o. 4-11/1, KGNM Trust, Hydershakote, Gandipet Mandal, R.R.District, Cyberabad due to his recent health issues wanted some legal opinion/advice, has travelled to my office and on searching his documents in my office it has been observed that he had lost the Original Sale Deed bearing No.313 of 1961, dated 7-2-1961, registered and executed at SRO-Tanuku of Andhra Pradesh lost on 5-2-2023. Any finders please return to my client or to the undersigned, immediately and the said person will be suitably rewarded. Hence the Public Notice.

**Sd/-M.Natarajan**
Advocate
5-50, Malkajigiri
Hyderabad-47,
**#9246334514.**

## పిఆర్‌టియు సంఘం ఆవిర్భావ దినోత్సవం



**పరిగి ఫిబ్రవరి9,ప్రభాతవార్త :**
పరిగి నియోజవర్గం కుల్కచర్ల మండలంలో పిఆర్‌టియు 52వ సంఘ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంఘం నాయకులు మాట్లాడుతూ....1971లో సామల యాదగిరి ఈ సంఘాన్ని స్థాపించడం జరిగింది. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయ సమస్యలను సాధించడంలో పిఆర్టియు పాత్ర చాలా గొప్పది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, మండల విద్యాధికారి అబీబ్ అహ్మద్, రాష్ట్ర పెంటయ్య, సతీష్, నర్సింలు, తావూరియా, వెంకటయ్య, జిల్లా నాయకులు మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, నరసింహారెడ్డి, సుధీర్, శివప్రసాద్, మండల నాయకులు శ్రీనివాస్, శేఖర్, సంతోష్, బస్వరాజ్, బాల్యా, దేవుల, దస్తయ్య, రమేష్, తిరుపతి రెడ్డి, వెంకటేశ్వరరావు, శంకర్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరం ప్రారంభం



**చౌడపూర్ ఫిబ్రవరి9,ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు పథకం, గురువారం మండల పరిధిలోని మరికల్ గ్రామంలో ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరం ఈ నెల 24వ తేది వరకు మరికల్ గ్రామంలో నిర్వహిస్తారని 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తామని అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పాండురంగయ్య, వైద్యాధికారి విజయలక్ష్మీ, ఎంపిటిసి సత్య, మెడికల్ ఆఫీసర్ శ్రీజ, సూపర్‌వైజర్ కలమ్మ, శరభలింగం, దమయంతి పంచాయతీ సెక్రెటరీ పరమేశ్వరి, ఏఎన్ఎం ఇందిర, శకుంతల, ఆశా కార్యకర్తలు ప్రమీల అంజమ్మ, రాజేశ్వరి, నిర్మల ,భాగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిరా, బాలమణి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా

**: సర్పంచ్ వెంకటేశ్ గౌడ్**



కొర్రెముల గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్ గౌడ్

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
గ్రామంలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తున్నట్లు సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలో గురువారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సభకు విచ్చేసిన గ్రామస్తులు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను గ్రామ సభ దృష్టికి తెచ్చారు. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో గ్రామ సభలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించినట్లు సర్పంచ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కందుల రాజు ముదిరాజ్, కార్యదర్శి కవిత, వార్డు సభ్యురాలు వి. అరుంధతి, స్థానిక నాయకులు వంగాల సురేందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్**



పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం నాయకులు శ్రీనివాస్

**తాండూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**
పోలీసుల ముందస్తు అక్రమ ఆరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల పోరాట వేదిక ఆద్వర్యంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇవ్వాలని, ఇంటి స్థలాలు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు దగ్గర చేపట్టిన ధర్నాకు వెళ్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌ను తాండూరు పోలీసులు ముందస్తుగా ఆరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను అణచివేసే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. పోలీసుల ముందస్తు అక్రమ ఆరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## బిజెపి కార్యకర్తకు ఆర్థిక సహాయం

**చౌడపూర్ ఫిబ్రవరి9,ప్రభాతవార్త :**
మండల పరిధిలో వీరాపూర్ గ్రామానికి చెందిన బిజెపి బూత్ కార్యదర్శి లింగం యొక్క తల్లి పక్షవాతం బారిన పడింది. విషయం తెలుసుకున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ గౌడ్, గురువారం కార్యకర్త నివాసానికి వెళ్లి, ఆర్థిక సాయం చేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు బందయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పుడర్ మండల అధ్యక్షుడు అనిల్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు కుమ్మరి వెంకటేశం, సీనియర్ నాయకులు జనార్థన్, వీరాపూర్ బూత్ కమిటీ అధ్యక్షుడు నర్సింలు, యువ మోర్చా మండల అధ్యక్షుడు శరత్, యువ నాయకులు రాజు, వెంకటేష్, నరేష్, రాజశేఖర్, పటేల్, శ్రీను, రఘు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రారంభం

-అట్టహాసంగా ముగిసిన ఉత్సవాలు
-కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు
-మారుమ్రోగిన శివనామస్మరణ
-భారీగా తరలివచ్చిన భక్తజనం
-దాత రేగట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మితమైన ఆలయం



ఆమనగల్లులో నూతన అయ్యప్పకొండ శివాలయం వద్ద ధ్వజస్థంభ ప్రతిష్ట చేవడుత్ను భక్తులు



రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

**ఆమనగల్లు, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:**
ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్పకొండ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ భవాని రామలింగేశ్వరస్వామి దేవాలయం అట్టహాసంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 07 నుండి 9వరకు మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించి దేవాలయాన్ని ప్రారంభించారు. ఉత్సవాల చివరిరోజు గురువారం గణపతి, భవాని, రామలింగేశ్వరస్వామి, నంది, వీరభద్రస్వామి, నాగులు, ధ్వజస్థంభ, శిఖర బలిపీఠం ప్రతిష్టించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన రేగట్టి శ్రీనివాస్ అలియాస్ సహార శ్రీనివాస్ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభోత్స ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కాగా చివరిరోజు విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు అంగరంగా వైభవంగా కన్నుల పండువగా జరిగాయి. ధ్వజస్థంభ దాత గజ్జె నరేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ధ్వజస్థంభ, శిఖర బలిపీఠం ప్రతిష్టాపన జరిగింది. కాగా చివరిరోజు గురుసిద్ధు మణికంత, జాతీయ ఓబిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తల్లోజు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ్మాలు ఉత్సవాలకు హాజరై పూజలలో పాల్గొన్నారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివచర్య మహస్వామి, జె. మల్లిఖార్జున్, శివస్వాములు నాగిళ్ళ శ్రీను, బిట్టి సాయిలు, లింగంపల్లి అశోక్, జెజ్జాయిల అంజి, పద్మప్రశాంత్, వెంకటయ్య, గుండ్రాతి కుమార్‌గౌడ్, వెంకట్, బివిఆర్, గణేశ్, మహేశ్, దుర్గ ప్రసాద్, నరేష్, శేఖర్, గుండె యాది, కుమార్, గోవర్ధన్, జంగయ్య, దేవరాజు, శివగౌడ్, నరేష్, శ్రీహరి, సిద్దు, వెంకటేశ్, బాలస్వామి, రాజు, కండెసాయి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మరమ్మతులు చేపట్టాలి

**-అధ్వానంగా మారిన రహదారులు**



యాచారంలో గుంతలమయమైన రహదారి దృశ్యం

**యాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులన్ని గుంతలమయమై అధ్వాన్నంగా తయారయ్యాయి. రహదారులపై అక్కడక్కడా గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ప్రధాన రహదారి అయిన కుక్క నంది నుండి నందీశ్వరాలయం వరకు రోడ్డు అధ్వాన్నంగా మారింది. మండల కేంద్రంలో నందివనపర్తి వెళ్లే రోడ్డు సుమారు 50 మీటర్ల మేరకు అధ్వాన్నంగా మారింది. బస్టాండ్‌లో నిల్చుంటే దుమ్ము, ధూళితో ప్రయాణీకులు నరకయాతన అనుభవిసు ్తన్నారు. నల్లవెల్లి గ్రామపంచాయితీ నుండి గ్రామ శివారు వరకు గ్రామ ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైంది. మాల్, నల్లగొండ చౌరస్తా నుండి పాతమాల వరకు రోడ్డు పరిస్థితి దుర్భరంగా ఉంది. అదే విధంగా మేడిపల్లి గ్రామంలో కూడా ప్రధాన రహదారి పరిస్థితి కూడా అలాగే ఉంది. మరమ్మతుల కోసం సర్పంచ్, కార్యదర్శిల దృష్టికి తీసుకెళ్లినా వారు ఆర్‌అండ్‌బి రోడ్లతో తమకు సంబంధం లేదని వివరించడం చాలా బాధాకరమని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రమాదకరంగా, ఇబ్బందికరంగా ఉన్న రోడ్లకు చిన్న చిన్న మరమ్మత్తుల గురించి ఆర్‌అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డు నుండి వెళ్లే ప్రయాణీకులు నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణీలు, రోగులు, వికలాంగులు రోడ్డు గుండా ప్రయాణించాలంటే వారు పడుతున్న బాధ వర్ణనాతీతం. సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పతనం ఖాయం

**- పరిగి మాజీ శాసనసభ్యుడు టి రామ్మోహన్‌రెడ్డి ధీమా**



పూడూరు మండలం మన్నెగూడలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ శాసనసభ్యుడు టి రామ్మోహన్‌రెడ్డి, పక్కన రఘునాథ్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సురేందర్ తదితరులు

**పూడూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో పతనం ఖాయం డిసిసి అద్యక్షుడు, పరిగి మాజీ శాసనసభ్యుడు టి రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎఐసిసి మాజీ అద్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలో భాగంగా పిసిసి అద్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి హనుమాన్ మందిరంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మన్నెగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పూడూరులో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా యూపీఏ చైర్పర్సన్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ గతంలో తీసుకున్న నిర్ణయంతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలనవల్ల దోపిడీ రాజ్యంగా ఏర్పడిందని ఆరోపించారు. ప్రాణహిత, చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల ఊసేలేదని, రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంటు ఉష్కాకిగా మిగిలిందని, పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్రూంలతో అడ్రస్సు గల్లంతు అయ్యిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోని వచ్చిన వెంటనే రైతుల జీవితాల్లో వెలుగులు నింపే విధంగా రూ.2లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ రైతు బరోసా పథకం, భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15వేలు ఇస్తామని వివరించారు. రైతులు పండించిన పంటలకు మద్దత్తు ధరతో కొనుగోలు చేస్తామని, నష్టపోయిన పంటలకు భీమా పథకం, రైతు కూలీలు, కౌలు రైతులకు సైతం వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున నిర్వహించిన కాన్వాయ్ యాత్ర మన్నెగూడ, పూడూరు, రాకంచెర్ల, సోమన్‌గుర్తిల మీదుగా పరిగి మండలానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అద్యక్షుడు సురేందర్, ఎంపిటిసిలు లక్ష్మణ్, ఆరీఫ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్, బాదాం శ్రీనివాస్‌గుప్తా, శ్రీనిపా స్‌రెడ్డి, పార్టీ నాయకులు మోయిన్, ఎండి సయ్యద్, నర్సింలు, తాజుద్దీన్, సల్లావుద్దీన్, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, పరిగి నియోజకవర్గంలోని కుల్కచెర్ల, పరిగి, దోమ, గండీడ్, మహ్మదాబాద్, చౌడాపూర్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్



పోచారం మున్సిపల్ 8 వ వార్డులో కంటి వెలుగు వైద్య శిబిర ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధి లోని 8 వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని గురువారం చైర్మన్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంధత్వ నివారణకుగాను ప్రభుత్వమే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులతో పాటు కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తుందని అన్నారు. ఇంకా అవసరమైన వారికి కంటి పరీక్షలు సైతం చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బైరు హీమ అధ్యక్షతన జరిగిన కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కమి షనర్ అర్ర సురేశ్, మాజీ ఎంపీటీసీ చెర్కు బద్రీనారాయణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బైర అయిలయ్య కురుమ, బద్దం జగన్‌మోహన్ రెడ్డి, సామల బుచ్చి రెడ్డి, చక్రపాణి, ఎ. బాల్‌రెడ్డి, దుర్గయ్య, సంజీవ, పద్మనాభం, వాణి, మాధవి, అరుణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం : శేఖర్‌రెడ్డి

**యాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
ఆపదలో ఉన్న వారికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని బిఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన గుంటోజు కుమారస్వామి మృతి చెందగా ఆయన భాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సంతాపం తెలిపారు. గ్రామంలో ఉన్న నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి ట్రస్టు ఆధ్వ ర్యంలో నిరంతర సేవలందిస్తామన్నారు. కుమారస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి వారికి మనోధైర్యం కల్పించారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి : ఎంపిపి



కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**
కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పటేల్ విజయ్ కూమార్ అన్నారు. గురువారంరోజు దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ రమాదేవిలతో కలసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థులు గ్రామంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ కిషన్, కంటివెలుగు క్యాంప్ మెడికల్ ఆఫీసర్ డా.తుల్జారాం, హెల్త్ సూపర్‌ఫైజర్ వజ్రమల, పిఎన్ఎంఒ రమేష్, డీఈఓ కృష్ణ, ఎఎన్ఎంలు నర్సమ్మ, మంజుల, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్ పద్మమ్మ, మహిలా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, వార్డుమెంబర్‌లు, గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
దౌల్తాబాద్ మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన శివస్వాములు గురువారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్ళారు. గ్రామంలో ఉ న్న శివాలయంలో ఆలయ పూజారిచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడిలతో శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సం దర్భంగా శివస్వాములు మాట్లాడుతూ...శివరాత్రి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో వెలసిన మల్లీకార్జునస్వామిని దర్శించుకో బోతున్నట్లు వారు తెలిపారు.



ఇరుముడిలతో శ్రీశైలానికి కాలినడకన బయలుదేరిన శివస్వాములు

## ఉపాధ్యాయుల బదిలీలు,పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

**-తపాస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటయ్య**



తపాస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా గౌరవ అద్యక్షులు వెంకటయ్య తదితరులు

**కొడంగల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
ప్రభుత్వం చేపడుతున్న ఉపాద్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్ర క్రియను పాదర్శకంగా చేపట్టాలని తెలంగాణా ప్రాంత ఉపాద్యాయ సంఘం(తపాస్) జిల్లా గౌరవ అద్యక్షులు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం కొడంగల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో తపాస్ ఆద్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఉపాదా ్యయుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ఉపాద్యాయ బదిలీలు, ప్రమోషన్‌లలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల క్లస్టర్ ప్రధానో పాద్యాయురాలు ప్రసన్న, తపాస్ కొడంగల్ మండల శాఖ అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్, గౌరవ అధ్యక్షులు రాములు, ఉపాధ్యక్షులు బల్లయ్య, జిల్లా కార ్యవర్గ సభ్యులు పృధ్వీసింగ్, బాలరాజు, కోషాధికారి కృష్ణయ్య, మొగులప్ప, డివిజన్ ఇంచార్జ్ సిద్దు మల్లేష్ పాల్గొన్నారు.

## పెద్దమంగళారం గ్రామంలో శివస్వాముల మహాపడిపూజ



**మొయినాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త :**
శివనామ స్మరణంతో మారుమోగిన పెద్దమంగళారం గ్రామం, మొయినాబాద్ మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో ఎల్గని లక్ష్మియాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివసాముల జ్యోతిర్లింగాల మహపడిపూజ కార్యాక్రమం భక్తులందరిని శివనామ స్మరణంతో ముక్తులను చేసింది, ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురువారం పెద్దమంగళారం శివనామ స్మరణంతో మారుమోగింది. శివమాల వేసుకున్న భక్తులు ముక్తకఠంతో శివనామ జపముతో, భక్తి, శ్రద్దలతో పెద్ద ఎత్తున పూజా కార్యాక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో బక్కని నర్సింహులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు, ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ శివుని ఆజ్ఞాలేనిది చీమైనకుట్టదని శివును భక్తి శ్రద్దలతో కోలిస్తే, కోరికలు తీరుతాయని, భక్తులకు కావాల్సిన కోరికలను తీర్చేది శివుడే అని అన్నారు, భక్తి శ్రద్దలతో మంచి నడవడిక అలవర్చుకుంటారిని అన్నారు, ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నాయకులు గూడెం సుబాష్ యాదవ్, కోమ్మిడి వెంకట్ రెడ్డి, ఆకూల పద్మారావు, కోడిచెర్ల భిక్షపతి యాదవ్, బీసిసెల్ నాయకులు పోలంపల్లి అశోక్, కత్తి తమేదం, మాణిక్యం, రాఘవులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ, మేడ రామేశ్వర్‌రావు, శేఖర్ రెడ్డి, కోడంగల్ నియోజకవర్గం నాయకులు బాల కిషోర్ యాదవ్, మహే శ్వరం నియోజకవర్గ ముఖ్య నాయకులు జగదీష్‌రెడ్డి, దివాకర్, జూబ్లిహిల్స్ నియోజకవర్గ దుర్గారావు, చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య నాయకులు అంజనేయు లు, ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, రాజుగౌడ్, శరీఫ్, సుదాకర్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యాకర్తలు, పెద్దమంగళారం గ్రామ భక్తులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయంతం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**కొడంగల్, ఫిబ్రవరి 9ప్రభాతవార్త :**
కొడంగల్ లయన్స్‌క్లబ్ అద్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. గురువారం స్ధానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శిబిరానికి తరలివచ్చిన వారికి కంటి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు ఉన్న 35 మందిని గుర్తించి ఉచిత ఐఓఎల్ శస్త్ర చికిత్సల నిమిత్తం వారిని మహబుబ్‌నగర్‌లోని రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించినట్లు లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసప్పయాదవ్, శివరాజ్‌పాటిల్, మురారి వశిష్ట, కేవీ.రాజేందర్, మునీర్‌లు తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారికి లయన్స్‌క్లబ్ అద్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు లయన్స్‌క్లబ్ అద్వర్యంలో పేదలకు ప్రతి నెల ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హాత్ సే హాత్ యాత్రకు ప్రజల అపూర్వ స్పందన

**-తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పీఠం**

**కొత్తూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**
అమ్మ నేను నీ బిడ్డని.... తల్లి....అక్కా, చెల్లి అంటూ కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ హాత్ సే హాత్ జోడో యాత్రలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్తూర్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొత్తూర్ మండలంలోని మల్లాపూర్‌తాండ, మల్లాపూర్ తాండ, మక్తగూడ, గూడూరు, రెడ్డిపాలెం, కుమ్మరిగూడ, అక్విన్‌గూడ, తీగాపూర్, ఫాతిమాపూర్, స్టేషన్ తిమ్మాపూర్, తిమ్మాపూర్ చౌరస్తా వరకు యాత్ర కొనసాగించారు. పంటచేలు, చెకల్లో కలియ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ గురించి మహిళా రైతులకు వీర్లపల్లి శంకర్ ఓపికగా వివరిస్తున్నారు. గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి గడపగడపకు కాంగ్రెస్ పార్టీ చేయబోయే అభివృద్ధి గురించి వివరిస్తున్నారు. అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు తలచుకుంటే కాంగ్రెస్ రాజ్యం మళ్లి వస్తుందంటూ సూచిస్తున్నారు. మహిళా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇచ్చే ప్రయోజనాల గురించి వీర్లపల్లి శంకర్ వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయంలో కాంగ్రెస్ పాలన ఎలా ఉంటుందో రేవంత్‌రెడ్డి పాలనలో కూడా అదేవిధంగా పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



పాదయాత్రలో స్వాగతం పలుకుతున్న మహిళామణులు